# రెండవ ప్రపంచ యుద్ధం - సోషలిస్టు రష్యా

- అలోక్ ముఖర్జీ

***2017 నవంబరు 7న అక్టోబర్ విప్లవ శత వార్షికోత్సవ ముగింపు సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన బహిరంగసభలో కామ్రేడ్ అలోక్‌ముఖర్జీ ప్రసంగవ్యాసం - సంపాదకుడు***




**సోషలిస్టు** రష్యా గురించి, రెండవ ప్రపంచ యుద్ధం గురించి ఏం మాట్లాడాలన్నా మొదటి ప్రపంచయుద్ధం తర్వాత యూరప్‌లోనూ, మిగిలిన ప్రపంచ దేశాల్లోనూ వున్న పరిస్థితి గురించి, విజయవంతమైన రష్యా అక్టోబరు విప్లవం గురించి క్లుప్తంగానైనా మాట్లాడుకుని తీరాలి. ప్రపంచ చిత్రపటంలో సోవియట్ సోషలిస్టు రష్యా ఉనికి, ఫాసిజం ఆవిర్భావం, రెండవ ప్రపంచ యుద్ధంలో వీటికి సంబంధించిన పరిణామాలు అర్థంకావాలంటే వాటి నేపథ్యాన్ని తెలుసుకుని తీరాలి. అయితే వాటి వివరాలు పూర్తిగా ఇవ్వటం ఇక్కడ సాధ్యంకానందున క్లుప్తంగానే వివరిస్తాను. అదీ చరిత్రకు సంబంధించినవి.

## ప్రపంచ శాంతికోసం నూతన సోషలిస్టు దేశం సలిపిన కృషి

క్రూరమైన దోపిడీపీడనల నుండి పేదరికం నుండి కార్మిక కర్షకులను విముక్తిచేయటం, జార్ నియంతృత్వంనుండి వివిధ జాతులను విముక్తి చేయటమేగాక, రష్యా విప్లవం-ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల వెన్నులో వణుకు పుట్టించింది. దోపిడీదారుల కబంధ హస్తాలనుండి బయటపడటానికి ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక జనావళి సాగిస్తున్న విప్లవ పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచింది. అది యుద్ధాలను నివారించటానికి, ప్రపంచశాంతి సాధనకు ఎంతగానో కృషిచేసింది.

1917 నవంబర్ 7న రష్యాలో విప్లవం విజయవంతం అయ్యేంతవరకు రష్యా మొదటి ప్రపంచయుద్ధంలో ఒక భాగస్వామిగా వుంది. కానీ ప్రజలు కోరుకున్నది మాత్రం 'శాంతి, భూమి, ఆహారం'. ప్రజల అవసరాలను తీర్చుతూ యుద్ధాన్ని కొనసాగించటమన్నది అసాధ్యం. అందుకే నవంబర్ 8వ తేదీనే సోవియట్ ప్రభుత్వం తన మొట్టమొదటి అధికారిక డిక్రీలో "యుద్ధంలో పాల్గొంటున్న దేశాల ప్రజలందరూ యుద్ధాన్ని ముగించాలని, ఎటువంటి మినహా యింపులు లేని శాంతికొరకు చర్చలు జరప వలసిందిగా తమ తమ ప్రభుత్వాలను కోరాలి" అని ప్రకటించింది. దేశంలోపల, బయట వున్న అభివృద్ధినిరోధక శక్తులవలన పొంచివున్న ప్రమాదాన్నుండి తన శక్తులను రక్షించుకుని నిర్మాణయుతం గావించుకోవటానికి అప్పుడే ఏర్పడిన సోవియట్ ప్రభుత్వానికి శాంతి చాలా అవసరం. యూరప్‌లోని ఇతర దేశాలలోని విప్లవశక్తులకు శాంతి ఉపయోగపడుతుందన్న ఆశ కూడా వుంది. అందుకే ఆ డిక్రీ 'సత్వర శాంతి చర్చలకు' పిలుపిచ్చింది. కానీ ఇటు మిత్రకూటమి దేశాలుకానీ, అటు జర్మన్లుగానీ తొలుత ఈ చర్చలకు ముందుకు రాలేదు. రాకపోగా సోవియట్ ప్రభుత్వాన్ని పతనం గావించటానికి గట్టి ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు 1917 డిసెంబరు మధ్యలో సోవియట్ అధికార ప్రతినిధులు, జర్మనీ, దాని మిత్రదేశాల అధికార ప్రతినిధులు బ్రెస్ట్‌లిటోవ్స్క్‌లో సమావేశమై తక్షణ మరియు నిరవధిక కాల్పుల విరమణతో శాంతి ఒప్పందానికి మార్గంవేశారు. కానీ అదేమంత సూటిగా జరగలేదు. శాంతి చర్చలు గందరగోళంగా కొనసాగాయి. సోవియట్ నాయకత్వంలోనే దీనిపై భిన్నాభిప్రాయాలున్నాయి. కానీ లెనిన్ 'దొంగలతో శాంతి' కూడా విప్లవ మనుగడకు అవసరమైనదేనని స్పష్టం చేయ గలిగాడు. మరోవైపు సామ్రాజ్యవాద శక్తులైన ఫ్రాన్సు, బ్రిటను, అమెరికా దేశాలు యుద్ధాన్ని కొనసాగించాలని రష్యాను వత్తిడి చేస్తున్నాయి. సోవియట్ ప్రజలను విపత్కర స్థితిలోకి నెట్టటానికి చూస్తున్నాయి. చివరకు 1918 మార్చిలో ఒకవైపు రష్యా; మరోవైపు జర్మనీ, ఆస్ట్రియా-హంగరీ, బల్గేరియా, ఒటోమన్ సామ్రాజ్యాలు ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. అది నిజంగా దొంగశాంతి ఒప్పందమే. దీనివల్ల 1,30,000 చదరపు మైళ్ళ సరిహద్దు ప్రాంతాన్ని రష్యా కోల్పోయింది. ఇందులో చాలా ముఖ్యమైన ప్రదేశాలతోపాటు ఉక్రెయిన్ ధాన్యాగారం కూడా వుంది. సుమారు 6 కోట్ల 20 లక్షలమంది ప్రజలు జర్మనీకి అప్పగించబడ్డారు. కానీ ఒకటి మాత్రం స్పష్టం. ప్రపంచయుద్ధంలోంచి రష్యా బయటపడి ప్రతీఘాతుకుల దాడులనుండి విప్లవాన్ని సంరక్షించుకోగలిగింది. నూతన సోషలిస్టు ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోగలిగింది. 1918 మార్చి 8న జరిగిన పార్టీ కాంగ్రెసులో ఈ ఒప్పందం ఆమోదించ బడింది.

కానీ విప్లవాన్ని ఓడించటానికి సామ్రాజ్యవాద శక్తుల నిరంతర ప్రయత్నాలు సాగుతూనే వున్నాయి. మొదటి ప్రపంచయుద్ధంలో జర్మనీ ఓడిపోయింది. అప్పుడు వర్సెయిల్స్ సంధి కుదిరింది. ఈ యుద్ధం ఆర్థికంగా, రాజకీయంగా జర్మనీ పరిస్థితిని దిగజార్చింది. ఈ సంధిలో జర్మనీపై విధించబడ్డ అనేక ఆంక్షలలో ముఖ్యమైనవి.

1. నానాజాతిసమితిలో జర్మనీ ప్రవేశానికి నిరాకరణ
2. జర్మనీ వలసలన్నిటిని ఫ్రాన్సు, బ్రిటన్‌ల మధ్య పంపిణీ
3. జర్మనీ సైనిక శక్తి లక్షకు పరిమితం చేయటం; వైమానిక దళాలు, జలాంతర్గాముల రద్దు; ఆరు యుద్ధనౌకలకు మాత్రమే పరిమితం

4. యుద్ధంవల్ల కలిగిన నష్టాలకుగాను 13,200 కోట్ల గోల్డు మార్కులను జర్మనీ పరిహారంగా చెల్లింపు
5. సార్ బొగ్గుగనులు అల్సాక్ లావెయిన్‌లను ఫ్రాన్సుకు అప్పగించటం
6. డాన్జిగ్‌ను స్వేచ్ఛా నౌకాశ్రయంగా చేయటం–

దాదాపుగా యుద్ధం చివరకు వచ్చిన దశలో ఈ కూటమిలో చేరిన ఇటలీ కూడా మోస పోయానని భావించింది. కాకపోతే నానాజాతి సమితిలో సభ్యత్వం మినహా ఈ వర్సెయిల్స్ సంధివల్ల దానికేమీ ఒరగలేదు.

వర్సెయిల్స్ సంధిపై 1919 జూన్ 28న సంతకాలు జరిగాయి. కానీ ఒక దగ్గర, జర్మనీతో సహా ఈ శక్తులన్నీ ఐక్యమయ్యాయి. అప్పుడే జనించిన రష్యా సోషలిస్టు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడే విషయంలో అవి ఐక్యంగా వున్నాయి. 1917 నవంబరు నుండి 1922 వరకు ఇది సాగింది. వీరంతా ముందు రష్యాలో అంతర్యుద్ధాన్ని రగల్చటానికి చూశారు. తర్వాత కొన్నిసార్లు ప్రత్యక్షంగాను, కొన్నిసార్లు పరోక్షం గాను రష్యాపై దాడులు జరిగాయి. 1920లో ఫ్రాన్సు సహకారంతో పోలిష్ వారు దాడిచేయగా, 1920, 21లలో బారన్‌మానరీమ్ నాయకత్వం లోని ఫిన్‌లాండ్ 1922 అక్టోబర్ వరకు (తూర్పున వ్లాడిఓస్టాక్‌లో తరిమివేయబడేవరకు) చేసిన దాడికి జర్మనీ, జపాన్ మరియు దాని మిత్రదేశాలు మద్దతునందించాయి.

అన్ని ప్రధానమైన సామ్రాజ్యవాద దేశాలు వారిలో వారికెంత కుమ్ములాటలు ఉన్నప్పటికీ సోషలిస్టు రష్యాను తమ ప్రధాన శత్రువుగా భావించి, నాశనం చేయాలని చూశాయి. ఇవి సోషలిస్టులు రష్యా అభివృద్ధిక్రమంలో ఎదురైన సవాళ్ళు.

1922లో, జెనీవాలో 'యూరప్ ఆర్థిక పునర్నిర్మాణం' అన్న విషయంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. నూతనంగా ఆవిర్భవించిన సోషలిస్టు రాజ్యం మొదటిసారిగా ఆ సదస్సుకు ఆహ్వానించబడింది. అందులో ఆయుధ సంపత్తిని సమకూర్చుకోవటంపై పరిమితులుండాలని, సోవియట్ ప్రతినిధుల నాయకుడు జార్జియస్ ఛిఛరిన్ ఇలా ఉద్ఘాటించాడు: "యూరప్‌పైన, ప్రపంచంపైన కొత్త యుద్ధాల బూచి పొంచి వున్నంతకాలం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిలదొక్కు కోలేదు". సోవియట్ చేసిన ఈ ప్రతిపాదనను పరిశీలించటానికి బదులుగా మిత్రదేశాలన్నీ యుద్ధానంతర ఆర్థిక పునర్నిర్మాణ భారాన్నంతా రష్యా, జర్మనీలపై నెట్టివేసే ప్రయత్నం చేశాయి. ఇది ప్రత్యక్షంగా అవమానించటం మాత్రమే కాదు, దాడి కూడా. అందుకే రష్యా, జర్మనీ, జనీవా కాన్ఫరెన్సు నుండి వైదొలగి 1922 ఏప్రిల్ 16న ప్రఖ్యాత రాపల్లో ఒడంబడికను చేసుకున్నాయి. ఈ ఒడంబడికద్వారా సమానత్వ ప్రాతిపదికన సుహృద్భావ వాతావరణం ఏర్పరు చుకుని, ఇరు దేశాలు తమ తమ అప్పులను రద్దుచేసుకోవాలని నిర్ణయించుకున్నాయి.

నూతనంగా ఆవిర్భవించిన సోషలిస్టు రాజ్యం తనకోసం మాత్రమేకాక ప్రపంచ శాంతికోసం ఏం చేసిందో అర్థంచేసుకోవటానికి ఇది సరిపోతుంది. సామ్రాజ్యవాదశక్తులు ఏనాడూ కూడా శాంతిని కాంక్షించలేదన్నది కూడా తేలికగానే అర్థమవుతున్నది. దోపిడీలో అత్యధిక వాటాలను కొట్టేయడానికి, శక్తివంతంగా తయార వడానికి ఎంత చేయాలో అవి అంత చేశాయి, అందులో వెనుకబడినవి మూలకు నెట్టివేయబడ్డాయి.

గెలిచిన దేశాలు సోవియట్ రష్యాను ఆదర్శంగా తీసుకుని వుంటే రెండవప్రపంచ యుద్ధం జరిగేది కాదు. ఏ సామ్రాజ్యవాద శక్తీ కూడా అది నెరవేరాలనుకోలేదు. సామ్రాజ్యవాద మంటేనే యుద్ధం. వాళ్ళు అన్నిటికన్నా భయపడింది సోవియట్ దేశానికే.

**ఫాసిజం ఆవిర్భావం**

సోషలిజం, క్యాపిటలిజం, ఫ్యూడలిజం, కమ్యూనిజం, బ్రాహ్మణిజం లాగా 'ఫాసిజం' పదానికి కూడా దాని స్వీయ మూలాలున్నాయి. కానీ పైవాటిలా అది ఒక స్థిరమైన సామాజిక వ్యవస్థ నుండి ఏర్పడిన పదం కాదు. అది తనకనువైన వ్యవస్థను రుద్దింది. దీనికి మూలం లాటిన్ పదం 'ఫాసెస్'లో వుంది. అంటే గొడ్డలి చుట్టూ కడ్డీలు పెట్టి కట్టివేసినది అని అర్థం. ఇది పురాతన రోమ్‌లో న్యాయమూర్తుల ఆధిపత్యానికి చిహ్నం. ఇటలీలో ముస్సోలినీ ఈ గుర్తును తన పార్టీ గుర్తుగా తీసుకుని ప్రజలపై ఆధిపత్యాన్ని నెరిపే విధానాన్ని గట్టిగా వ్యక్తీకరించాడు. సోషలిస్టు పార్టీ పత్రిక అయిన 'అవంతీ'కి ఒకప్పుడు సంపాదకునిగా వున్న ముస్సోలినీ ఫాసిస్టు పార్టీ ఆవిర్భావానికి మూలకారకుడెలా అయ్యాడన్న వివరాల్లోకి పోకుండా, ఆ పార్టీ తాత్వికత ఏమిటో చర్చిద్దాం. ముస్సోలినీ స్థాపించిన పార్టీ పేరు 'ది పీపుల్ ఆఫ్ ఇటలీ' (ఇటలీ ప్రజలు). అదే పేరుతో పత్రిక కూడా వుండేది. ఆ పత్రిక లక్ష్యం 'మితవాదుల వెనుక బాటుతనంపై, అతివాదుల విచ్ఛిన్నంపై సాగించే సమరం'గా ముస్సోలినీ పేర్కొన్నాడు. వర్సైల్స్ సంధివల్ల ఇటలీ పోగొట్టుకున్న పరువును తిరిగి నిలబెట్టాలనే పిలుపుతో 1919 జూన్ 6న 'ఫాసీ ఆఫ్ కంబాట్' అనే వ్యాసం ప్రచురితమైంది. అదే సమయంలో ఆర్థికాభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన అన్న ముస్సోలినీ నినాదాలు పెద్ద సంఖ్యలో యువత ముస్సోలినీ వైపు నిలబడేట్లు చేశాయి. ఆవిధంగా ఉగ్ర పెట్టుబడీదారీ వర్గానికి అనుకూలమైన దురభిమానపూరిత, యుద్ధపిపాస రాజ్యం అభివృద్ధిచెందింది. జీవన మార్గా లన్నింటా, విద్యా సంస్థల్లోనూ సంస్కరణలు చేపట్టబడ్డాయి. ఒకవైపు 'ఫియట్' వంటి పెద్ద పరిశ్రమలు ముస్సోలినీకి అండగా నిలబడగా, మరోవైపు రాజ్యంయొక్క, దాని నాయకుడైన ముస్సోలినీయొక్క సర్వవ్యాపిత ఆధిపత్యానికి సాధారణ ప్రజానీకం బలవంతంగా తల వంచారు. ప్రజలను అణకువగా వుంచేందుకు సాయుధ సైన్యంతోపాటుగా 'బ్లాక్‌షర్ట్స్' అనే ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేశారు ఫాసిస్టులు.

కానీ, జర్మనీలో హిట్లర్ వచ్చేంతవరకు ఫాసిస్టుల నుండి నిజమైన ముప్పేమీ రాలేదు. హిట్లర్ క్రమాన్ని కూడా సంక్షిప్తంగా చూద్దాం. అడాల్ఫ్ హిట్లర్ 1919లో 'జర్మన్ వర్కర్స్ పార్టీ'లో ప్రచారదళ సారధిగా, ఉపన్యాసకుడిగా చేరాడు. 1920లో 'జర్మన్ నేషనల్ సోషలిస్ట్ వర్కర్స్ పార్టీ' (NAZI)గా అది పేరు మార్చు కుంది. జర్మనీలోని వ్యూమర్ రిపబ్లిక్కుని, వర్సైల్స్ సంధిని అది వ్యతిరేకించింది. జర్మనీ రాజకీయ చట్రాన్ని సవాల్‌చేయటానికి, ప్రపంచశాంతికి విఘ్నాలు కలిగించటానికి కావలసిన బలాన్ని పొందటానికి దానికి సమయం పట్టింది. 600 పైగా సీట్లున్న జర్మనీ పార్లమెంటు రీచ్‌స్టాగ్‌లో 1928లో అది కేవలం 12 సీట్లను

మాత్రమే కైవసం చేసుకోగలిగింది. ఇటలీ ఫాసిస్టులు, నాజీలు దాదాపుగా ఒకే విధమైన సిద్ధాంత, రాజకీయ అభిప్రాయాలను కలిగి వున్నారు.

1928 వరకు మిగిలిన ప్రపంచమంతా వీటివల్ల త్వరలో రాబోయే ముప్పుని అంచనా వెయ్యలేకపోయింది. 1928 జులై 13న కొమింటర్న్ 6వ మహాసభలో స్టాలిన్ ఇలా అన్నాడు. "5వ మహాసభ జరిగినప్పుడు చాలా కొద్దిమంది మాత్రమే ఆంగ్లేయుల, అమెరికన్ల వైరుధ్యమే ప్రధానమైనదన్నారు. అప్పుడు వారిరువురి కలయిక గురించి మాట్లాడటం ఒక సంప్రదాయం కూడా. మరోవైపు బ్రిటను, ఫ్రాన్సుల మధ్య వైరుధ్యం గురించి, అమెరికా, జపాన్‌ల మధ్య వైరుధ్యం గురించి, విజేతలకు, పరాజితు లకు మధ్య వైరుధ్యం గురించి ఎక్కువగా మాట్లాడారు. ఆనాటికి ఈనాటికి ప్రధానమైన తేడా ఏమంటే పెట్టుబడిదారీ శిబిరంలో వచ్చిన మార్పులు. అమెరికా పెట్టుబడిదారీ విధానానికి, బ్రిటీషు పెట్టుబడిదారీ విధానానికి మధ్యనున్న వైరుధ్యం ప్రధానమైనదిగా మారింది". (స్టాలిన్ వర్క్స్, వాల్యూమ్ 11, పేజి.207)

అప్పటివరకు ఇటలీలో ఫాసిజం, జర్మనీలో జాతివివక్ష పేరుతో నాజీయిజం పెద్ద ప్రభావం చూపలేకపోయాయి. అందుకే యుద్ధాలకు సిద్ద మయ్యే సామ్రాజ్యవాద దేశాల ఫాసిజాన్ని, ప్రజల్ని అణచివుంచే సాధనంగా మాత్రమే చూశాయి. అందుకే పైన పేర్కొన్న రిపోర్టులో స్టాలిన్ ఇంకా ఇలా అన్నాడు. "కార్మికులను అణచిపెట్టకుండా సామ్రాజ్యవాదం బలం పుంజుకోవటమనేది అసాధ్యం. అదే ఫాసిజం".

**సోవియట్‌లో అభివృద్ధి**

1920ల చివరనాటికి సోవియట్ యూనియన్ సామాజికాభివృద్ధి చరిత్రలోనే ప్రత్యేకంగా నిలిచిపోయిన రెండు విధానాలను చేపట్టింది. అవి సమిష్టి వ్యవసాయం, పంచవర్ష ప్రణాళికలు.

వీటిని ప్రారంభించగానే సోవియట్ రాజ్యం పేద రైతులపై ఒత్తిడి చేసి సమిష్టి వ్యవసాయానికి అంగీకరింపచేస్తుందని శత్రువులు ప్రచారం మొదలుపెట్టారు. కొన్ని చెదురుమదురు సంఘటనలను చూపి ప్రపంచాన్ని నమ్మింప ప్రయత్నించారు. కాని వారు అవి కులక్కులు చేసిన విద్రోహ చర్యలుగా, కొన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజలు గాడితప్పి చేపట్టిన చర్యలుగా వాటిని గుర్తించలేదు; నేటికీ గుర్తించడంలేదు. ప్రపంచంలో ఎక్కడా ఒక కొత్త సమాజ స్థాపనకు కొత్త ఆర్ధిక నిర్మాణాన్ని తయారుచేసుకోడానికి అత్యధిక ప్రజానీకం కదిలిన దాఖలాలు లేవు. సోవియట్‌లో తన కోసమే కాకుండా మొత్తం సమాజం కోసం బతికే ఒక 'నూతన మానవుడు' ఉద్భవించాడు. అన్నా లూయీ స్ట్రాంగ్ కొన్ని సంవత్సరాలపాటు సోవియట్ జైళ్ళలో గడిపింది. ఆ తర్వాత 'స్టాలిన్ యుగం' అనే పుస్తకాన్ని వ్రాసింది. ఆ పుస్తకంలో ఆమె సమిష్టి వ్యవసాయాన్ని గురించి వ్రాస్తూ ప్రపంచ వ్యవసాయ చరిత్రనే మార్చిందని వ్యాఖ్యానించింది.

ఇక్కడ గణాంకాలను యివ్వదలుచుకోవటం లేదు. ఎందుకంటే ఈ వ్యాసం వేరే అంశం గురించి ఉద్దేశించినది. ఆనాటి పరిస్థితులలోని వాస్తవాలు తెలియచేయడమే ముఖ్య అవసరం.

పంచవర్ష ప్రణాళికలు కూడా అంతే ప్రాచుర్యం పొందినవనేది వాస్తవం. ఇవి ఆర్ధిక రంగాన్ని, అలాగే మొత్తం సమాజాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రజాస్వామిక పద్ధతిలో చేపట్టిన గొప్ప కృషి. ప్రతి రైతు ఇది క్రెమ్లిన్ నుండి వచ్చిన ప్రణాళిక కాదని, తామే రూపొందించుకున్న 'ప్రణాళిక'గా చెప్పుకోగలిగాడు. ప్రపంచమంతా మహా ఆర్థికమాంద్యంతో గింగిరాలు తిరుగు తుంటే సోవియట్‌లో ప్రథమ పంచవర్ష ప్రణాళిక విజయవంతంగా అమలయ్యింది. అది ఎంతగా విజయవంతమైందో సోవియట్ ప్రచారకుల మాటల్లో కంటే బ్రిటిష్ పెట్టుబడిదారుడు గార్బన్ జార్విక్ 1932 అక్టోబర్‌లో చెప్పిన మాటలు ప్రస్తావించుకుందాం: "నేను ఇప్పుడు కమ్యూనిస్టును గానీ బోల్షివిక్కునుగానీ కాను. నేను ఖచ్చితంగా పెట్టుబడిదారుడినే. వ్యక్తివాదినే. మా ఫ్యాక్టరీలు, నౌకాశ్రయాలు పనిలేకుండా ఖాళీగా వుంటే, అలాగే సుమారు 30 లక్షలమంది మా ప్రజలు ఉపాధి కోసం నిరాశా నిస్పృహలతో ఎదురు చూస్తుంటే రష్యా ముందుకు దూసుకెళ్తోంది. పంచవర్ష ప్రణాళికల ద్వారా ఆశించినదానికంటే ఎక్కువ సాధించారు అనే విషయాన్ని మించి మీరు ఆలోచించాలి.... రష్యన్ల గురించి, వారి పంచవర్ష ప్రణాళికల గురించి తక్కువ అంచనాలు వేయవద్దు. సోవియట్ ప్రభుత్వం తప్పక కుప్పకూలిపోతుందనే నమ్మకంతో వుంటే మీరు తప్పుచేసినట్లే. మీరు ఆ తప్పు చేయకండి.... రష్యా ఈ రోజు ఆదర్శవంతమైన సజీవమైన దేశం. రష్యా అద్భుతమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న దేశం. రష్యా నిర్దేశించుకున్న లక్ష్యాలు గొప్పవని నేను నమ్ముతున్నాను.... వీటన్నిటికంటే మించి రష్యాలోని యువకులు, కార్మికులకు ఉన్నది, ప్రస్తుతం పెట్టుబడిదారీ దేశాలలో లేనిది – "ఆశ" (Hope)".

కాని అభివృద్ధి యొక్క చరిత్ర సరళరేఖలా వుండదు. అది వంకర టింకర్లుగానే నడుస్తుంది. ఫాసిజం ప్రస్తుతం తానున్న స్థితిలోనే యథా తథంగా వుండలేదు. అలాగే సోవియట్ రష్యాకు ప్రశాంత వాతావరణంలో సోషలిజాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశాలు లేకుండా పోయాయి. రెండవ ప్రపంచయుద్ధం మొత్తం పరిస్థితులను మార్చివేసింది.

**కోరలు పీకివేయబడిన ఫాసిజం**

ఇటలీ, జర్మనీలలో ఫాసిజం వేళ్ళూను కుంటోంది. రాపల్లో ఒప్పందంపై జర్మనీ సంతకం చేసిననప్పటికీ నాజీలు కమ్యూనిస్టుల పట్ల, సోవియట్ రష్యాపట్ల తీవ్ర శత్రుపూరిత వైఖరి తోనే వున్నారు. 1928 వరకు వారు దుందుడుకు విధానంతో వున్నప్పటికీ బలహీనంగానే వున్నారు. 1929 ఆగస్టులో జర్మన్ కమ్యూనిస్టుపార్టీ (KPD) కేంద్ర కార్యాలయంపై దాడిచేశారు. దురహంకారపూరితమైన "హెరన్ ఓక్" (ఉత్తమ జాతి) సిద్ధాంతం ప్రజల్లో సామూహిక యుద్ధోన్మాదాన్ని, కమ్యూనిస్టు వ్యతిరేక, యూదు వ్యతిరేక మానసిక స్థితిని సృష్టించింది.

అధికారాన్ని హస్తగతం చేసుకున్న తర్వాత హిట్లర్ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా కమ్యూనిస్టు వ్యతిరేక, యూదు వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగించాడు. బ్రిటన్, ఫ్రాన్స్ లాంటి ఐరోపా శక్తులు జర్మనీని సమర్ధించసాగాయి. ఈ

ఫాసిస్టులు సోవియట్ రష్యాపై దాడులు చేస్తాయనే ఆశతో ఇవి అలాంటి వైఖరి తీసుకున్నాయి. అందుకు 1938 సెప్టెంబర్‌లోనే జెకొస్లవేకియాలోని సుడెటన్ లాండ్ భూభాగాన్ని తమ స్వంత భూభాగంగా జేర్చుకోవాలని అనుకున్నప్పుడు బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదులు మ్యూనిచ్ ఒప్పందం ద్వారా దాన్ని పళ్ళెంలో పెట్టి యిచ్చాయి. సోవియట్ రష్యా సహాయం చేస్తానన్నా చెక్ ప్రభుత్వం ప్రతిఘటించే పరిస్థితి లేకుండా పోయింది. 1938 సెప్టెంబర్ 27వ తేదీన బ్రిటన్ ప్రధాన మంత్రి నెవిలె ఛాంబర్‌లిన్, ఫ్రాన్స్ ప్రధానమంత్రి ఎడ్వర్డ్ డాలడైర్, అడాల్ఫ్ హిట్లర్, బెనిటో ముస్సోలిని మరియు ఇటలీ విదేశాంగమంత్రి జెల్కాజోసినోల మధ్య మ్యూనిచ్ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ సిరా తడి ఆరక ముందే 1938 అక్టోబర్ 1వ తేదీన జర్మనీ సైన్యం సుడెటన్ ల్యాండ్‌ను వశపరచుకుంది. వాస్తవానికి బ్రిటన్, ఫ్రాన్స్‌లు అనుసరించిన ఈ రాజీవిధానం తక్షణం యుద్ధాన్ని నివారించడానికే. ఈ యుద్ధ నివారణ కూడా రష్యా వైపు యుద్ధం మళ్ళడానికి ఇదొక మలుపుగా పనికి వస్తుందనే అవగాహనతోనే అలా చేశాయి. కాని అలా జరగలేదు. 1934 జనవరిలోనే (మ్యూనిచ్ ఒప్పందానికి నాలుగేళ్ళముందే) కామ్రేడ్ స్టాలిన్ "...... ప్రస్తుతం ఫాసిజం యుద్ధోన్మాద బూర్జువా రాజకీయ నాయకులకు ఆసక్తిదాయకమైన సరుకుగా మారిపోయింది. నేను ఫాసిజం యొక్క సాధారణ రూపం గురించి మాట్లాడడంలేదు. ప్రాధమికంగా జర్మన్ తరహా ఫాసిజం గురించి మాట్లాడుతున్నాను. ఇది తన్ను తాను జాతీయ సోషలిజంగా చెప్పుకుంటోంది. కాని అది తప్పు. ఎందుకంటే ఎంత తీవ్రంగా అన్వేషించినా దానిలో సోషలిజం అణుమాత్రం కూడా కన్పించదు" అని హెచ్చరించాడు. కామ్రేడ్ స్టాలిన్ చేసిన ఈ హెచ్చరిక బ్రిటన్, ఫ్రాన్స్‌లకు చెవికెక్కలేదు. ఆయనింకా యిలా అన్నారు:

"…. ఈ సందర్భంలో జర్మనీలో ఫాసిజం యొక్క విజయాన్ని శ్రామికవర్గం యొక్క బలహీనతకు సంబంధించిన లక్షణంగానే కాదు; శ్రామికవర్గంపట్ల ఫాసిజానికి దారితీసిన సోషల్ డెమోక్రసీ చేసిన కుట్రల ఫలితంగా పరిగణించాలి. ఇంకా దీనిని బూర్జువా వర్గ బలహీనతకు సంబంధించిన లక్షణంగా కూడా పరిగణించాలి. ఎందుకంటే ఇక ఎంతమాత్రం బూర్జువావర్గం తన పాత పార్లమెంటరీ విధానాలద్వారా, బూర్జువా ప్రజాస్వామ్య విధానాలద్వారా పాలించలేదు. ఫలితంగా శాంతియుత విదేశీ విధానం ద్వారా ప్రస్తుత పరిస్థితులలో తన పరిపాలన కొనసాగింపుకు మార్గాన్ని అన్వేషించ లేదు. అందువలన అనివార్యంగా యుద్ధ మార్గాన్ని అనుసరించక తప్పదు" (జె.వి.స్టాలిన్, లెనినిజం సమస్య. సి.పి. యస్.యు(బి) 17వ కాంగ్రెస్ రిపోర్టు. పేజి 682. పెకింగ్ 1976)

వాస్తవానికి బ్రిటన్, ఫ్రాన్స్ లాంటి సామ్రాజ్యవాద శక్తులకు శాంతి సాధన పట్ల ఆసక్తి లేదు. 1935లో ఇటలీ అబిసీనియాపై దాడిచేసి ఆక్రమించుకున్నప్పుడు, 1936లో ఇటలీ, జర్మనీలు స్పెయిన్‌లో మిలటరీ చొరబాట్లు చేసినపుడు, 1937లో జపాన్ మంచూరియాను స్వాధీనం చేసుకొని, దక్షిణ, మధ్య చైనాలలోకి ప్రవేశించి పెకింగ్, తియాన్సిన్, షాంఘైలను ఆక్రమించుకున్నప్పుడు, 1938 ప్రారంభంలో ఆస్ట్రియాను జర్మనీ స్వాధీనం చేసుకున్నప్పుడు బ్రిటన్, ఫ్రాన్స్‌లు వ్యతిరేకించలేదు. ఈ దురాక్రమణలను ఈ దేశాలు పట్టించుకోదలుచు కోలేదు. కమ్యూనిస్టులను జపాన్ తుడిచిపెట్టాలని అమెరికా కోరుకుంది. జర్మనీ, ఇటలీ, జపాన్‌లచే అభివృద్ధి చేయబడ్డ అక్షరాజ్యాలు సోవియట్ రష్యా, చైనాలో కొన్ని భాగాలు, ఆఫ్రికా ఎడారుల ఆక్రమణతో సరిపెట్టుకోవాలని ఆశించాయి. మ్యూనిచ్ ఒప్పందం కూడా సారాంశంలో ఆ దిశగా సాగిన ఒప్పందమే. ఇది దురాక్రమణ శక్తులతో వీరి రహస్య ఒప్పందమే. సోవియట్ రష్యా సమయం తీసుకొని బ్రిటన్, ఫ్రాన్స్‌ల పై దురాక్రమణలకు వ్యతిరేకంగా "ఉమ్మడి భద్రత" కొరకు ప్రతిపాదించింది. కాని ఆ దేశాలు "జోక్యం చేసుకోకపోవడం" (Non-intervention) తటస్థంగా వుండడం లాంటి విధానాలను తీసుకొని ఉమ్మడి భద్రత ప్రతిపాదనను తిరస్కరించాయి. 1936-39ల మధ్య జరిగిన స్పానిష్ అంతర్యుద్ధం సందర్భంగా ఇవి "జోక్యం చేసుకో రాదనే" విధానాన్ని అవలంబించాయి. జర్మనీ, స్పెయిన్‌లోని రిపబ్లికన్ ప్రభుత్వాన్ని కూల దోయడానికి వీలుగా ఫాసిస్టు ఫ్రాంకోకు బహిరంగంగా వెన్నుదన్నుగా నిలిచిన సందర్భంలో, అలాగే రిపబ్లికన్లకు సహాయపడడానికి కొమింటాంగ్ "అంతర్జాతీయ బ్రిగేడ్"ను ఏర్పరచినపుడు బ్రిటన్, ఫ్రాన్స్‌లు తటస్థ విధానాన్ని అనుసరించాయి. ఆవిధంగా సోవియట్ రష్యా దురాక్రమణదారులను అడ్డుకొని శాంతి స్థాపనకు చేస్తున్న కృషిని బ్రిటన్, ఫ్రాన్స్‌లు భగ్నపరిచాయి. ఆ దేశాల్లో అలాగే అమెరికాలోని పురోగామి శక్తులు యుద్ధ నివారణకు సోవియట్ రష్యాతో మైత్రి పాటించాలని కోరినా ఆ ప్రభుత్వాలు మాత్రం దానికి భిన్నంగా వ్యవహరించాయి.

1939 మార్చిలో జర్మనీ పోలండుపై దాడి ప్రారంభించింది. సోవియట్ రష్యా మరోసారి పోలండుకు సహాయకారిగా వుండడానికి, ఒక మిత్ర కూటమి ఏర్పరచాలని కోరుకుంది. 1939 మేలో ఐక్య సంఘటన కొరకు, పోలండుకు సహాయం అందించడానికి చర్చలకు ప్రయత్నాలు జరిగాయి. కాని బ్రిటన్, ఫ్రాన్స్ మొదట్లో జాప్యం చేసే ఎత్తుగడలను అనుసరించాయి. చివరకు వైదొలిగాయి. ఫలితంగా పోలండు సోవియట్ సహాయాన్ని తిరస్కరించింది.

ఈ సామ్రాజ్యవాద శక్తులు, అక్ష రాజ్యాలను సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా పోరాడేవిధంగా చేయడానికి ప్రయత్నిస్తున్నాయనే విషయం స్పష్టమైంది. ఇక ఎలాంటి ప్రత్యామ్నాయం లేకపోవడంతో తన స్వంత బలంపైనే ఫాసిస్టు శక్తులను ఎదుర్కోవడానికి సోవియట్ రష్యా 1939 ఆగస్టు 23న రక్షణాత్మక ఒప్పందాన్ని చేసుకుంది. ఈ ఒప్పందం మోలటోవ్ - రిబ్బన్ ట్రాప్ పాయిట్‌గా పేరుగాంచింది.

వెంటనే 1939 సెప్టెంబర్ 1వ తేదీన రాజీశక్తులు చేసిన ఉపకారంతో హిట్లర్ పోలండ్‌పై దాడిచేసి రెండవ ప్రపంచ యుద్ధాన్ని లాంఛనంగా ప్రారంభించాడు. వాస్తవానికి ఇటలీ, స్పెయిన్, జపాన్‌లు అసంతృప్తిగా వుండడమేకాదు, ఆ ఒప్పందాన్ని వ్యతిరేకించాయి. మిత్ర దేశాలు అని పిలవబడే శక్తులు, లండన్‌లో చాంబర్లిన్ నాయకత్వాన వున్న హిట్లర్ సమర్ధకులు తప్పుడు మార్గంలో చిక్కుకొనడానికి ఉపయోగపడిన దౌత్య కుయుక్తి యిది.

ఆ తర్వాత జరిగిన సంఘటనలనిక్కడ వర్ణించడం సాధ్యమయ్యే పనికాదు. కాని 1939 సెప్టెంబర్ 1 మరియు 1941 జూన్ 22ల మధ్యకాలంలో సోవియట్ రష్యాపై హిట్లర్ దాడిచేసినపుడు ఒకవైపు అక్షరాజ్యాలు ఒకదాని తర్వాత మరొకటి మిలటరీ

దాడులతో ఐరోపా లోని అధిక ప్రాంతాన్ని, ఆఫ్రికా, ఐరోపాలోని అట్లాంటిక్ ప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకుంటుంటే మిత్రదేశాలు వాటి ధాటికి నిలువలేకపోయాయి. కాని అదే సందర్భంలో సోవియట్ రష్యా తన తటస్థ విధానంతో చదరంగం ఆటలోలా వ్యవహరిస్తూ అనేక సరి హద్దులలో జర్మనీని చొచ్చుకు రాకుండా నిలిపింది. 'స్టాలిన్‌యుగం' అనే తన పుస్తకంలో అన్నా లూయీ స్ట్రాంగ్ ఈ విషయాన్ని చక్కగా తెలియజేసింది. "ప్రపంచాన్ని జయించాలనే తన మార్గంలో తటస్థంగా వున్న రష్యాను హిట్లర్ తక్షణ ఆటంకంగా చూశాడు. రక్షణాత్మక ఒప్పందం అమలులో వున్న 22 నెలల కాలంలో సోవియట్ రష్యా మూడుసార్లు నాజీ సైన్యాల చొరబాటును అడ్డుకుంది. పోలండువైపు సోవియట్ సైనిక కవాతు, తూర్పువైపుగా హిట్లర్ చొచ్చుకురాకుండా ఒక సంవత్సరంపాటు నిలువరించింది. బెసర్బియాకు సోవియట్ తిరిగి రావడంతో బ్రిటన్‌పై దండయాత్ర చేయకుండా హిట్లర్ వెనక్కు తగ్గేట్లు చేసింది. బాల్కన్లు మరియు బాల్టిక్‌లలో మాస్కో అధికార రాజకీయాలు డెర్డానెల్స్ వద్ద హిట్లర్ దాడిని జాప్యం జరిగేటట్లు చేశాయి."

చివరకు 1941 జూన్ 22న ఫాసిస్టు శక్తులు సోవియట్ రష్యాపై దాడిచేశాయి.

**ఫాసిస్టులను సోవియట్ రష్యా ఓడించిన తీరు**

"ఇతర మార్గాల ద్వారా చేసే రాజకీయమే యుద్ధం". రాజకీయాలకు భావజాలం అవసరం. శ్రామికవర్గ సిద్ధాంతమైన కమ్యూనిస్టు భావజాలం ఆధారంగా సోవియట్ రష్యా తన స్వంత రాజకీయాలతో యుద్ధంలో పోరాడింది. మనం ఇంతకుముందే సమిష్టి వ్యవసాయం, పంచవర్ష ప్రణాళికలు, సోవియట్ యూనియన్‌లో వాటి అమలులో ప్రజల ప్రజాస్వామ్యం ఎంత పటిష్టంగా పాతుకుపోయి వుందో చర్చించాం. సోవియట్ రష్యా సామ్యవాద దేశం. అక్కడ ఒక కొత్త మానవుడు ఉద్భవించాడు. అతడు తన కోసంగాక మొత్తం సమాజం కోసం, ప్రపంచ శ్రామికవర్గ సౌభాగ్యం కోసం జీవించే మనిషి అని సోవియట్ పౌరులకు బాగా తెలుసు. వారు సోషలిజాన్ని పరిరక్షించుకోవాలనీ, అది కూడా తమకోసం మాత్రమే కాదనీ, ప్రపంచ శ్రామిక వర్గం సాధించుకున్న, ప్రపంచంలోని ఏకైక సామ్యవాద దేశాన్ని చేజార్చుకోకుండా కాపాడు కునేందుకని తెలుసు. అందుకే ఫాసిజానికి వ్యతిరేకంగా సోవియట్ ప్రజలే కాదు, అంతర్జాతీయంగా శ్రామికవర్గమంతా ప్రపంచ దుష్టశక్తులుగా వున్న ఫాసిస్టు శక్తులను నిర్మూలించాలనే దృఢ నిశ్చయంతో నిలబడింది.

ఆనాడు సామ్రాజ్యవాద భావజాల సమర్థకులు సోవియట్ యూనియన్‌ను, స్టాలిన్‌ను రక్షణాత్మక ఒప్పందం చేసుకున్నందుకు తీవ్ర విమర్శలు చేశారు. అయితే జరిగిన సంఘటనల గురించి వాటి మంచి చెడుల గురించిన ప్రస్తావన మాత్రం వుండేది కాదు. ఈ రోజుల్లో కూడా మార్క్సిస్టు లెనినిస్టులమని చెప్పుకునే కొందరు 1941 జూన్ తర్వాత చాలాకాలం మౌనంగా వున్న సామ్రాజ్యవాద ప్రచారకులతోటి గొంతు కలపడం ఆధునికతయింది.

ఇక్కడ ఒక విషయం తప్పక చెప్పుకోవాలి. ఫాసిజం అనేది జర్మనీ, ఇటలీ వాటి మిత్ర దేశాలలో కన్పించే లక్షణం మాత్రమే కాదు. ఇతర దేశాల్లో కూడా హిట్లర్‌కు ఐదవ స్తంభంలా పనిచేసే ఫాసిస్టులున్నారు. ఫాసిస్టులు దీన్ని ప్రణాళికాబద్ధంగా చేశారు. దేన్నైనా పట్టుకోవా లంటే దానిలోని అంతర్గత శక్తుల సహాయంతో పట్టుకోవడం తేలికనే విషయం అందరికీ తెలిసిన ఎత్తుగడే. కాబట్టి సోవియట్ యూనియన్ రెండు విషయాలలో జాగ్రత్తవహించాల్సి వచ్చింది. ఒకటి పంచవర్ష ప్రణాళికల ద్వారా అభివృద్ధి అయిన పరిశ్రమలను యుద్ధ సామాగ్రి తయారీకి వుపయోగించుకోవడం. రెండవది విద్రోహులు విద్రోహ చర్యలకు పాల్పడకుండా నిఘా పెట్టడం. ఈ రెండూ తేలికైన విధులు కావు. మొదటి పనికి సంబంధించి ప్రణాళికల రూపకల్పనలో కొన్ని మార్పులు చేయాల్సి వచ్చింది. కేంద్రం, చుట్టూ వున్న ప్రాంతాలు, ప్రజలు కలిసి రూపొందించ డానికి బదులుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రాధాన్యత యివ్వవలసి వచ్చింది. కాని రెండవ విధి చాల సవాళ్ళతో కూడుకున్నది. జనోవివ్, కామినేవ్, బకాయెర్ మొదలైన ప్రముఖ నాయకులే కుట్ర చేయటం, వారిని బహిరంగంగానే సోవియట్ ప్రెస్, విదేశీ దౌత్యవేత్తలు మరియు ప్రభుత్వ కార్యాలయాల ఎదుట విచారణ చేశారు. ఇలాంటి విచారణ వృత్తాంతాలు ఎన్నో వున్నాయి. మనస్ఫూర్తిగా సోషలిజాన్ని వ్యతిరేకించేవారే ఈ విచారణలను గురించి ప్రశ్నించారు. విచారణ విధానాలు, తీర్పులను, అక్కడ హాజరయిన విదేశీ పత్రికల, విదేశీ పౌరహక్కుల, దౌత్యవేత్తల వ్యాఖ్యానాలను తెలియజేసే అవకాశం వుండదు.

1937 జులైలో మార్షల్ టుక్‌చెర్‌స్కీతో బాటు ఏడుగురు ఇతర కమాండర్లను విచారించ డానికి తీసుకువచ్చారు. మిలటరీ రహస్యాలు బయటకు తెలియకుండా వుండటానికిగాను వీరిని రహస్యంగా విచారించారు. వీరికి హిట్లర్ ద్వారా డబ్బులు ముట్టాయని తేలింది.

అయితే కొద్దిమంది అమాయక ప్రజలు, నాయకులకు కూడా శిక్షలు పడి వుండవచ్చు. కాని సోవియట్ యూనియన్ పయనిస్తున్న పరిస్థితులు అసాధారణమైనవి. పైగా అమాయకు లను అరెస్టు చేసినందుకు ఒక జివిపి అధిపతిని విచారించారు. సోవియట్ ప్రభుత్వం అమాయక ప్రజలను విచారించడానికి వ్యతిరేకమనేది సుస్పష్టం.

ఏది ఏమైనా ఈ మొత్తం వ్యవహారం వలన సోవియట్ రష్యాలో జర్మనీ 'ఫిఫ్త్ కాలం'ను ఏర్పాటు చేసుకోలేకపోయింది.

ఇక సోషలిస్టు సోవియట్ యూనియన్ చేసిన ప్రజలందరి యుద్ధం గురించిన వాస్తవ కథనాలకు వద్దాం. సోవియట్‌పై దాడిచేస్తూ హిట్లర్ "ఇది చరిత్రలోనే అత్యంత పెద్ద సైనిక కవాతు" అని ప్రకటించాడు. ఇవి ఉత్తుత్తి మాటలు కావు. సోవియట్ యూనియన్ యొక్క 1800 మైళ్ళ పశ్చిమ సరిహద్దు వెంబడి 90 లక్షలమంది పూర్తిగా యుద్ధరంగంలో వున్నారు. ఈ యుద్ధతంత్రం బ్లిట్జ్‌క్రిగ్‌గా పిలువబడింది. శత్రుసైన్యంపై శక్తివంతమైన యుద్ధసామాగ్రి, ఆయుధాలతో విరుచుకుపడటం, పైనుండి వైమానిక దాడులు చేయడం ద్వారా శత్రుసైన్యం ప్రతిఘటనను దెబ్బతీసిన తర్వాత యుద్ధ ట్యాంకుల ద్వారా పౌర ప్రజలను నియంత్రించే

విధానమే ఇది. ఐరోపా యుద్ధరంగంలో హిట్లర్ ఈ విధానాన్ని విజయవంతంగా వుపయో గించాడు. రష్యాలో కూడా ఉత్తరాన లెనిన్ గ్రాడ్‌ను, మధ్య రష్యాలో మాస్కోను, దక్షిణాన కీవ్‌ను, ఒడెస్సాను ఆక్రమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఒకసారి ఈ నగరాలను పట్టు కుంటే జర్మనీ గుప్పిట్లోకి మొత్తం రష్యా వస్తుందనేది ఈ బ్లిట్జ్‌క్రీగ్ యుద్ధతంత్ర ఉద్దేశ్యం.

జర్మనీ, దాని యుద్ధసేనానులు కాకుండా, అక్షదేశాలను వ్యతిరేకించే శక్తులు కూడా ఒక్క నెలలో సోవియట్ రష్యా జర్మనీ ఆధిపత్యంలోకి వస్తుందని అనుకున్నారు. వీరంతా బూర్జువా యుద్ధ నిపుణులు ఆలోచించిన విధంగానే ఆలోచించారు. రష్యా ప్రజలను సోషలిజం ఏవిధంగా మార్చిందో వీరు ఊహించలేదు. స్టాలిన్‌కు ఈ విషయం బాగా తెలుసు. తన మొదటి రేడియో ప్రసంగంలో స్టాలిన్ “ఎక్కడా అజేయమైన సైన్యం వుండదు. ఎన్నడూ లేదు” అని ప్రకటించాడు. ప్రజలందరూ చేసే యుద్ధాన్ని ఫాసిస్టులకు రుచి చూపాలని, శత్రుసైన్యంపై పోరాడేందుకు ప్రజా యుద్ధమే ఎత్తుకు పైఎత్తుగా వుంటుందని పిలుపునిచ్చాడు.

వారాలు గడిచాయి. నెలలు గడిచాయి. తాము పీకల్లోతు కూరుకుపోతున్నట్లు, ఎలాంటి రక్షణ అందే అవకాశం కూడా లేదని జర్మన్లు గ్రహించడం మొదలుపెట్టారు. ఐరోపా యుద్ధ రంగంలో జర్మన్ సైన్యం శత్రు సైన్యాన్ని ఏకాకిని చేసేది. కాని యిక్కడ దీనికి పూర్తి భిన్నంగా జరుగుతుంది. సోవియట్ యూనియన్‌లోని ప్రతి ఫ్యాక్టరీ, ప్రతి వ్యవసాయ క్షేత్రము, ప్రతి పాఠశాల, ప్రతి కార్యాలయం ఒక దళంగా మారుతోంది. నేరుగా యుద్ధరంగంలో లేని వాళ్ళు ఆయుధాల తయారీ, ఆహారోత్పత్తి, యుద్ధానికి, ప్రజలకు అవసరమైన ఇతర వస్తువులను ఉత్పత్తి చేయడంలో నిమగ్న మయ్యారు. జర్మన్ సైన్యం ఒక ప్రాంతాన్ని ఆక్రమించి వెనక్కు వెళ్ళేలోపు అక్కడ ప్రతిదాన్ని తగులబెట్టి ధ్వంసం చేసేవారు. దీన్ని బూర్జువా యుద్ధ నిపుణులు “భూదగ్ధం”గా పిలుస్తారు. కాని వాస్తవంగా ఇప్పుడలా జరగడంలేదు. రైతులు తమ పంటలను కొద్దిగా ముందుగానే కోసుకొని వారి వ్యవసాయ యంత్రాలతో సహా సుదూర తూర్పు ప్రాంతాలకు తరలివెళ్ళి అక్కడ పంటలు పండిస్తున్నారు. కార్మికులు నట్లు, బోల్టు లతో సహా తమ యంత్ర సామాగ్రిని తీసుకెళ్ళి అధికార్లు నిర్ణయించిన తూర్పు ప్రాంతంలో మరో ఫ్యాక్టరీని ప్రారంభించారు.

ఇక్కడ రెండు ఉదాహరణలిస్తాను. సుదీర్ఘ కాలపు రాజకీయ పోరాట అనంతరం, అలాగే నిర్మాణంలో కూడా సవాళ్ళనధిగమించిన ఫలితంగా నైపర్ నదిపై సోవియట్ రష్యాకు సాంకేతికంగా ఒక గొప్ప ఆనకట్ట సమకూరింది. ఇంజనీర్లు, కార్మికులు దీన్ని నిర్దేశిత సమయాని కంటే ముందే పూర్తిచేశారు. కానీ, ఆ ఇంజనీర్లు, ఆ కార్మికులే తమ భావోద్వేగాలతో ముడిపడి వున్న ఆ ఆనకట్టను ధ్వంసం చేసి శత్రువులు ముందుకు రాకుండా నిలువరించారు. శత్రువు వెనుక గెరిల్లా దాడులు నిర్వహించడానికి వుండి పోయారు. ఖార్కోవ్ ట్రాక్టర్ పరిశ్రమలు యుద్ధ ట్యాంకుల తయారీ ప్రారంభించాయి. కాని జర్మన్ సైన్యం ఆ ప్రాంతానికి చొచ్చుకొస్తున్నపుడు మెజారిటీ కార్మికులు యంత్ర సామాగ్రితో సహా తూర్పు ప్రాంతానికి వెళ్ళిపోయారు. కొద్దిమంది మాత్రమే వుండి ఆ ఫ్యాక్టరీలో చివరి టాంకర్లను తయారుచేసి శత్రు దళాలనెదుర్కోవడానికి పంపారు. వారు శత్రువును ప్రతిఘటించడానికి అక్కడే వుండిపోయారు.

దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రజల చర్యలు, ప్రజలే తమ కోరిక మేరకు సమాజాన్ని అభివృద్ధి చేసుకునే క్రమం, తాము యిష్టపూర్తిగా ఒక సామాజిక వ్యవస్థను నిర్మించుకునే క్రమంలో సోషలిస్టు సమాజంలోనే సాధ్యమవుతుంది. అలాంటి సమాజ స్థాపనకు శాంతి కాలంలో గానీ, యుద్ధకాలంలోగానీ తమ ముందుండి నడిపే ఒక నాయకుడిని స్టాలిన్‌లో చూశారు. 1941 నవంబరు నాటికి జర్మనీ ఉక్రెయిన్‌ను స్వాధీనం చేసుకుంది. కీవ్‌ను కొల్లగొట్టింది. లెనిన్ గ్రాడ్‌ను పట్టుకొన్నారు. మాస్కోను మూడు వైపుల నుండి చుట్టుముట్టారు. యుద్ధ నిపుణులందరూ ఈ యుద్ధంలో జర్మనీదే గెలుపని భావించారు. కాని సోవియట్ ప్రజలు, వారి నాయకుడు స్టాలిన్ ఓడిపోయే రకం కాదు. విదేశీ రాయబారులతో సహా సోవియట్ ప్రభుత్వం సుదూర తూర్పు ప్రాంతానికి భద్రతకోసం, రక్షణ కోసం తరలించ బడింది. స్టాలిన్ కూడా మాస్కో విడిచి వెళ్ళారని ప్రతి ఒక్కరూ భావించారు. మాస్కోను ఆక్రమించినట్లు హిట్లర్ ప్రకటించాడు. కాని 1947 నవంబరు 7వ తేదీన స్టాలిన్ రెడ్ స్క్వేర్‌లో తన సైనికదళాల సమీక్ష నిర్వహించాడు. ప్రపంచమంతా దీన్ని చూసి నివ్వెరపోయింది. స్టాలిన్ తమతోబాటు యిక్కడే వుండి మాస్కోను రక్షిస్తున్నాడని తెలిసి ప్రజలు మరింత ఆత్మస్థైర్యం పొందారు. చివరకు మాస్కోను స్వాధీనం చేసుకోడానికి బదులుగా చలికాలం వచ్చేనాటికి జర్మనీ సైన్యం మైళ్ళకొలదీ వెనక్కి వెళ్ళి తలదాచు కోవలసి వచ్చింది. ఈ సంఘటన లెనిన్ గ్రాడ్‌లో జర్మన్ సైన్యం ప్రవేశించినప్పటికీ ప్రతి వీధి చివరివరకు పోరాటం చేయగలిగే విధంగా ఆ నగర ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని కల్గించింది. చివరకు గొప్ప సంగీత దర్శకుడైన షాస్కొరిచ్ కూడా ఎయిర్ వార్డెన్‌గా పనిచేశాడు. యుద్ధంలో పాల్గొంటూనే 7వ స్వర సమ్మేళనాన్ని కూర్పు చేశాడు. అది పోరాటాల సింఫనీ, విజయ బావుటా సింఫనీ. అది త్యాగాల స్వర సమ్మేళనం.

స్టాలిన్ గ్రాడ్‌లో కూడా అలాగే జరిగింది. ప్రతి పేట, ప్రతి వీధి, ప్రతి యింటివద్ద, చివరకు శిధిలాలను కాపాడుకోవడానికి కూడా పోరాటం చేశారు. ధైర్యముంటే ప్రతి ఇటుకల వరుసతో కోట కట్టవచ్చు అని గర్జించాడు స్టాలిన్. మనకు ధైర్యముంటే ప్రతి గుట్టను తిరిగి పొందవచ్చు అని సందేశం పంపాడు. 182 రోజులు అంటే ఆరు నెలలపాటు స్టాలిన్ గ్రాడ్ ప్రజలు యుద్ధం చేశారు.

సోషలిజం తయారుచేసిన ప్రజలు, హిట్లర్ యొక్క బ్లిట్జ్ క్రిగ్ ఎత్తుగడల యుద్ధం బదులుగా తన కళ్ళముందే చెదిరిపోతున్న యుద్ధాన్ని హిట్లర్‌కు చూపే పరిస్థితులు కల్పించారు.

1944 వేసవినాటికి సోవియట్ రష్యా సరిహద్దులనుండి జర్మన్‌సైన్యం వెనుకకు తరిమి వేయబడింది. ఆ తర్వాత రష్యన్ ప్రజాసైన్యం జర్మనీ వైపుకు దూసుకెళ్తూ ఆ కవాతు ఫాసిజం గుప్పిట నుండి ఆయా దేశాలను విముక్తిచేస్తూ సాగింది.

**ఫాసిజానికి వ్యతిరేకంగా సోవియట్ రష్యా యుద్ధాన్ని ప్రపంచం తీసుకున్న తీరు**

మొదట్లో బ్రిటన్, అమెరికాలు (ఆ సమయానికి జర్మనీ, ఫ్రాన్స్‌ను ఆక్రమించుకుంది) సోవియట్ రష్యా ప్రతిఘటన నెలరోజుల్లోనే అంతమైపోతుందని భావించిన మాట వాస్తవం. కాని యుద్ధం కొనసాగేకొలదీ పరిస్థితులు మారి పోయాయి. నాలుగవ వారంలో

ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్ నాయకత్వాన బ్రిటన్, సోవియట్ రష్యాతో ఒప్పందంపై సంతకం చేసింది. మరికొంత కాలానికి ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్టు నాయకత్వాన అదే పద్ధతిని అనుసరించింది. పాలకవర్గాలే కాదు, ఐరోపాలో అజ్ఞాతంగా సంఘటితమవుతూ జర్మనీచే నిర్బంధింప బడ్డవారు కూడా సంతోషంతో మరింత ధైర్యంగా పోరాడడం ప్రారంభించారు. భారతదేశంలో ప్రజల చైతన్యం, ఫాసిజంపట్ల వ్యతిరేకత బలోపేతమైనందున సి.పి.ఐ ఫాసిజమే ప్రధాన ప్రమాదకారిగా తన విధానాన్ని మార్చుకుంది. వియత్నాంలో కమ్యూనిస్టులు ఫ్రెంచి ఫాసిస్టులకు వ్యతిరేకంగా పోరాడటాన్ని ప్రారంభించారు. ప్రతిఘటిస్తున్న ప్రజాస్వామిక శక్తులతో జట్టు కట్టారు. ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రపంచస్థాయి కూటమి నిర్మితమైంది.

**తీసుకోవాల్సిన గుణపాఠాలు**

సోవియట్ రష్యా ఫాసిజంపై చేసిన పోరాటం నుండి మొదటగా మనం అర్థం చేసుకోవాల్సింది –సోవియట్ యూనియన్ మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత శాంతి కొరకు ప్రయత్నించింది. కాని సామ్రాజ్యవాదశక్తులు దీన్ని వ్యతిరేకించాయి. విజేతలు యుద్ధంలో దోచుకున్న సంపదలను, లాభాలను పంచుకోవడంలో నిమగ్నమయ్యారు. సోవియట్ శాంతి కృషిని వీరు తమ స్వంత ప్రయోజనాలకుపయోగించుకొని మరో యుద్ధానికి సన్నద్ధులయ్యారు.

రెండవ ప్రపంచ యుద్ధం సంభవించినప్పుడు రాజీమార్గం అనుసరించినవారు, దాన్ని నిలువ రించడంలో విఫలమయ్యారు. వారు అక్ష రాజ్యాలను సోషలిస్టు సోవియట్ యూనియన్ పైకి, ప్రపంచ వ్యాప్తంగా వున్న కమ్యూనిస్టులపైకి ఎగదోసి తాము తప్పించుకోడానికే ప్రయత్నించారు.

సోవియట్ రష్యా బ్రెస్ట్ – లిటోవ్‌స్కీ సంధి, రాపెల్లో సంధి, రక్షణాత్మక ఒప్పందాలను చేసుకుంది. ఇవి ఒక అవకాశంగా చేసుకున్న ఒప్పందాలు కావు. సామ్రాజ్యవాద శక్తులు ఆయా పరిస్థితులకు నెట్టబడిన కారణంగా జరిగిన ఒప్పందాలు.

ఫాసిస్టులను ఓడించిన నిజమైన నాయకుడిగా సోవియట్ రష్యాను కాలం రుజువు చేసింది. కాని రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సామ్రాజ్య వాదులు తిరిగి వారి పాత యుద్ధ విధానాలకు మళ్ళారు. సామ్రాజ్యవాదులు ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో మిత్రులుగా వున్నప్పటికీ సామ్రాజ్య వాదులు సామ్రాజ్యవాదులే అని మనం తప్పక తెలుసుకోవాలి.

ప్రజల శత్రువులకు వ్యతిరేకంగా, ఫాసిస్టులకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా, అన్నిరకాల ప్రతీఘాత శక్తులకు వ్యతిరేకంగా ప్రజలందరి శక్తిని సోషలిజం మాత్రమే వెలికితీయగలదు.

మార్క్సిజం లెనినిజం మరియు మావో ఆలోచనా విధానాన్ని ఎలుగెత్తి చాటుదాం. సోషలిజం కొరకు పోరాడేందుకు నిలబడదాం.

ooooo